పేదల బియ్యం..పెద్దలకు లాభం

- జోరుగా చౌకబియ్యం అక్రమ వ్యాపారం
- సరిహద్దులో మాఫియాను తలపిస్తున్న రేషన్ దందా
- రోజంతా నిల్వ.. రాత్రివేళల్లో లారీల్లో తరలింపు
- పట్టుబడుతున్నా పట్టించుకోని అధికారులు

రాయదుర్గం:

- ఈ చిత్రంలో కనిపిస్తున్న చౌక బియ్యం నిల్వలు రెండు రోజుల క్రితం హిర్దేహాళ్ సమీపంలో ఓ వ్యవసాయ క్షేత్రంలో వెలుగుచూసింది. ఈ అక్రమగుట్టు సోషల్ మాధ్యమాల ద్వారా రట్టయ్యింది. మేల్కొన్న వ్యాపారులు అక్కడి నుంచి రాత్రికి రాత్రే ఖాళీ చేయించినట్టు తెలుస్తోంది.
- డీ హీరేహాళ్ మండలంలోని వివిధ గ్రామాల్లో చౌక బియ్యం సేకరించి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న ఓ వాహనం రెండు రోజుల క్రితం పోలీసులకు పట్టుబడింది. అందులో 50 కిలోల బరువుతో 40 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. 20 క్వింటాళ్ల బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేశారు. బాధ్యులపై కేసు నమోదు చేశారు.
- రాయదుర్గం నియోజకవర్గంలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. ప్రతి నెలా 40 శాతానికి పైగా చౌక బియ్యం దళారుల చేతుల్లోకి వెళ్తోంది. అధికారమే హద్దుగా కొందరు అధికార పార్టీ నేతలు ఈ వ్యాపారం జోరుగా చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారు. ఫలితంగా పేదల బియ్యం .. పచ్చనేతలకు భోజ్యంగా మారింది.
- డీ హీరేహాళ్‌లో ఓ ముఠా బియ్యం వ్యాపారంలో ఆరితేరింది. లిక్కర్, ఇసుక, మట్టి, పేకాట, మట్కా ఇలా తలా ఒకరు పంచుకుని అక్రమ దాందా సాగిస్తున్నట్టు విమర్శలు ఎక్కువయ్యాయి. ఇటీవల మట్టి, ఇసుక దందా వెలుగు చూసింది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా మైనింగ్, రెవెన్యూ, సెబ్, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి, వాటి గుట్టు రట్టుచేశారు. ఇసుక డంపులు సీజ్ చేయగా, మట్టి రవాణాకు బ్రేక్ వేశారు. దీంతో అసంతృప్తితో రగిలిపోతున్న ఓ వర్గం బియ్యం ముఠాపై కన్నేశారు. వారి గుట్టు రట్టు చేసేలా కాపు కాస్తు వచ్చారు. మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు బియ్యం వ్యాపారంలో కుమ్మక్కయ్యారు. గ్రామాల్లో సేకరించిన బియ్యం బస్తాలను ఆటోల్లో ఓ వ్యవసాయ క్షేత్రంలోకి నిల్వ చేశారు. ఆ ఫొటోలను సేకరించిన కొందరు సోషల్ మాధ్యమాల్లో వైరల్ చేశారు. మేల్కొన్న వ్యాపారులు రాత్రికి రాత్రే వాటిని అక్కడి నుంచి మార్చేశారని స్థానికులు చెపుతున్నారు. బళ్లారి- బెంగళూరు జాతీయ రహదారి ఈ మండలం మీదే వెళ్తోంది. ఈ నేపథ్యంలో బియ్యం అక్రమ రావాణాకు రాచమార్గమైంది. జిల్లాలోని ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాల్లో సేకరించిన బియ్యం బళ్లారి దాటుకొని ఈ హైవే మీదుగానే బెంగళూరుకు చేరుతున్నట్టు తెలుస్తోంది.



డి హీరేహాళ్‌లో టీడీపీ నాయకుడు నిల్వచేసిన చౌక బియ్యం బస్తాలు



సరిహద్దులో పోలీసులకు పట్టుబడిన అక్రమ బియ్యం



రాయదుర్గం టీచర్స్ కాలనీలో ఇంటింటా బియ్యం సేకరిస్తున్న వ్యాపారి

వివిధ పద్ధతుల్లో సేకరణ ..

రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్ సహా, డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట, రాయదుర్గం ఐదు మండలాలు ఉన్నాయి. మొత్తం 219 చౌక ధాన్యపు డిపోలు, 99,300 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 2,97,357 కేజీల బియ్యం లబ్ధిదారులకు సరఫరా జరుగుతుంది. ఇందులో సుమారు 40 శాతం బియ్యం దళారుల చేతుల్లోకి వెళ్తోందన్న విమర్శలు ఉన్నాయి. ఈ బియ్యాన్ని సేకరించేందుకు కొందరు కూలీలను గుర్తిస్తారు. వారికి దినసరి వేతనం రూ.600 చెల్లిస్తారు. చౌక దుకాణాల వద్ద కాపు కాస్తూ కార్డుదారుల అవసరాన్ని బట్టి కొనుగోలు చేస్తారు. అప్పటికీ వ్యాపారం సాగకపోతే ఇల్లు ఇల్లూ తిరిగి బియ్యం సేకరిస్తారు. కిలో బియ్యం రూ.10 నుంచి రూ.12తో కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని ఆటోల్లో ఓ చోటకు చేర్చి రాత్రికి రాత్రే రైస్ మిల్లులు, కోళ్ల షెడ్లు, పశువుల దాణా ప్రాంతాలకు తరలించి, రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. సులభంగా ఆదాయం రాబట్టాలనే కొందరు ఈ అక్రమ వ్యాపారాన్ని ఎంచుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు దీనిపై దృష్టి సారించి కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అక్రమ రవాణాపై నిఘా

చౌక బియ్యం అక్రమంగా రవాణా చేసినట్లయితే కఠిన చర్యలు చేపడతాం. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత పటిష్టం చేస్తాం. కార్డుదారులు అమ్మకం చేపట్టకుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలి. చౌక బియ్యం అక్రమ రవాణా, నిల్వపై సరైన సమాచారం వస్తే సత్వరం స్పందిస్తాం. తప్పక కఠిన చర్యలు తీసుకుంటాం.

– రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు



మాట్లాడుతున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని భూపసముద్రం సర్పంచ్ అనిల్ కుమార్ నూతన గృహంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. ఎవరూ అధైర్యపడొద్దని.. పార్టీకి విధేయులుగా ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ చేసే అక్రమాలను ప్రజలకు తెలియచేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతుందని మండిపడ్డారు. టీడీపీ నాయకులు క్షేత్రస్థాయిలో చేసే అవినీతిని ప్రతి ఒక్కరూ ఎండగట్టాలన్నారు. టీడీపీ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశామన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకనుగుణంగా వైఎస్ జగన్ పరిపాలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మురళీమోహన్‌రెడ్డి, ఆర్‌టీ కాంతారెడ్డి, కేశవరెడ్డి, రాళ్ల తిమ్మారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, గంధవీడి తిప్పేస్వామి, రామిరెడ్డి, హంపన్న, సోమశేఖర్‌రెడ్డి, టీ.శివ, హేమారెడ్డి, పూసల అంజి,స్వామి,సవారప్ప,మల్లేశ్, వన్నూరుస్వామి,సత్తి,కరిబసవ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

- మాజీ ఎంపీ తలారి రంగయ్య



ముచ్చర్లపల్లిలో వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

శెట్టూరు: నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని శెట్టూరు, ముచ్చర్లపల్లి గ్రామాల్లో జరిగిన శుభకార్యాలకు మాజీ ఎంపీ రంగయ్య హాజరయ్యారు. శెట్టూరులో మాజీ సర్పంచ్ బొమ్మజ్జి రమేష్ నూతన గృహ ప్రవేశానికి, ముచ్చర్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు ఉప్పర నవీన్‌కుమార్ వివాహ రిసెప్షన్‌కు ఆయన హాజరయ్యారు. అనంతరం అయ్యగార్లపల్లిల్లో జెడ్పీటీసీ మంజునాథ స్వగృహంలోని వరలక్ష్మీ వ్రతం వేడకలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి, వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్ఎం ఉమ, ఎల్ఎం మోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకులు జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథరెడ్డి, సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, ఈరన్న, గంగాధర, నాయకులు శెట్టూరు తిప్పేస్వామి, ఎమ్మెస్ రాయుడు, హరినాథరెడ్డి, రాష్ట్రకృష్ణ, శ్యామ్ సుందర్, గోళ్ల సూరి, బిక్కి హరి, విజయ్‌కుమార్, మాదయ్య, ప్రతాప్, సిద్ధలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

సర్జన్, హెల్త్ సెక్రటరీకి ఉత్తమ సేవా అవార్డు



మంత్రి, కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న సర్జన్ మున్వర్‌రాజ్



వార్డు హెల్త్ సెక్రటరీ సరోజను అభినందిస్తున్న డీఎంహెచ్‌ఓ దేవి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్న మున్వర్‌జార్ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. 9వ సచివాలయం అర్బన్ హెల్త్ సెంటర్‌లో వార్డు హెల్త్ సెక్రటరీ సరోజ ఉత్తమ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా గురువారం అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా అవార్డు, ప్రశంతాపత్రాన్ని అందుకున్నారు.

ప్రజా సంక్షేమానికి చిత్తశుద్ధితో పాటుపడదాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవశ్రీనివాసులు

రాయదుర్గం: ప్రజా సంక్షేమానికి సభ్యులంతా చిత్తశుద్ధితో కృషి చేద్దామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రాయదుర్గం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు హొన్నే మల్లికార్జున, కో ఆప్షన్ సభ్యుడు దిలవర్‌బాషా పాల్గొన్నారు. ముందుగా శాఖల వారిగా చేపట్టిన పురోగతి, చేయాల్సిన అభివృద్ధి ప్రణాళికలపై అధికారులు చదివి వినిపించారు. అనంతరం సభకు హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంపీడీఓ చిక్కన్న, డీటీ రఘు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

రాయదుర్గంటౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతోపాటు రాయదుర్గం, డి.హీరేహాళ్, కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ వీరేష్, రాజగోపాల్, ఆంజనేయులు రిటైర్డ్ లెక్చరర్ అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కళ్యాణదుర్గం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ శానిటేషన్ పథకం కింద పంచాయతీలకు అందజేసిన ట్రాక్టర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కళ్యాణదుర్గం మండలంలో 7 పంచాయతీలు, కంబదూరు మండలంలోని 5 పంచాయతీలకు మొత్తం 12 ట్రాక్టర్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాలమాన్, ఈఓఆర్డీ బాలాజీలతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



రాయదుర్గంలోని మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలందుకున్న శ్రీమహాలక్ష్మీదేవి



రాయదుర్గం నేసేపేట వరలక్ష్మీదేవి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలు, నిష్టతో పాటించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అమ్మవారి ఆలయాలతో పాటు ఇళ్లలో మహిళలు నిష్టతో వరలక్ష్మీదేవి వ్రతాన్ని ఆచరించారు. పట్టణంలోని నేసేపేటలో వెలసిన వరలక్ష్మీదేవి ఆలయంలో మహిళలు పెద్ద ఎత్తున హాజరై సామూహిక వ్రత పూజ చేశారు. కళ్లీమఠం స్కూల్ సమీపంలో వెలసిన మహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజ మహోత్సవాన్ని నిర్వహించారు.

వరలక్ష్మి వ్రతం పూజల్లో ఆర్డీఓ

కళ్యాణదుర్గం: స్థానిక సరస్వతీ విద్యా మందిరంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం పూజలో ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మిత పాల్గొన్నారు. ప్రధానాచార్యులు కరణం తిరుమలరావు ఆధ్వర్యంలో వ్రతం నిర్వహించారు. ఆర్డీఓ రాణీసుస్మిత వరలక్ష్మి దేవిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. విశ్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి శ్రీనివాస్, విద్యా మందిరం సభ్యులు శ్రీధర్, రంగనాథ్‌శర్మ, బాలాజీ పాల్గొన్నారు.

కంబదూరు: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం పూజలు ఇంటింటా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు గృహాల్లో వరలక్ష్మీ ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప,బెళుగుప్ప తండాలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి, శ్రీపద్మావతిదేవి ఆలయాల్లోనూ, గృహాల్లో నిర్వహించారు. బెళుగుప్పలోని కొల్హాపురి మహాలక్ష్మి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, బూదిగుమ్మ శ్రీపద్మావతి వెంకటరమణ స్వామి తదితర ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

కూడేరు: కూడేరులోని కోదండ రామాలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహానికి తొలుత క్షీరాభిషేకం చేశారు.

జగదీశ్వరి ఆలయంలో వరలక్ష్మి వ్రతం

ఉరవకొండ: గుంతకల్లు రోడ్డులోని జగదీశ్వరి ఆలయంలో వరలక్ష్మి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, మహా మంగళహారతి, కుంకమార్చన, దీక్షా హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్నారు.

వజ్రకరూరు: స్థానిక లలితా త్రిపుర సుందరీదేవి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు విశేష పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, అర్చనలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు.



కళ్యాణదుర్గంలో వరలక్ష్మీదేవిని దర్శించుకుంటున్న ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత



విశేష అలంకరణలో జగదీశ్వరి అమ్మవారు



కంబదూరులో వరక్ష్మీవ్రతం పూజలు చేస్తున్న భక్తులు

ఆశా కార్యకర్తకు సన్మానం



ఆశా కార్యకర్త తులశమ్మను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ: రాకెట్ల పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌కు హాజరైన గర్భిణులు, వారి సహాయకులకు ఆమిద్యాల ఆశా కార్యకర్త తులశమ్మ సొంత ఖర్చుతో శుక్రవారం భోజనం ఏర్పాటు చేశారు. తులశమ్మకు మనవరాలు జన్మించిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. బేటీ బచావో బేటీ పడావో అన్న సూక్తిని నిజం చేస్తూ తులసెమ్మ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచినందుకు ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఎస్ఎండీ షఫీ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ నాయక్, ఉరవకొండ తాలుకా అధ్యక్షుడు నాగరంగయ్య, ప్రధాన కార్యదర్శి నిమ్మల వెంకటేష్, శేఖర్, స్వర్ణలత ఆధ్వర్యంలో తులసెమ్మను సన్మానించారు.

సంజప్పతాతకు ప్రత్యేక పూజలు



అలంకరణలో సంజప్పతాత

ఉరవకొండ: మోపిడి గ్రామంలో వెలసిన సంజప్పతాతకు శుక్రవారం విశేష పూజలు, అభిషేకాలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంజప్పతాతకు పంచామృతాభిషేకం, రథాంగ హోమాలు నిర్వహించారు. శనివారం స్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరగనుందని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఉదయం స్వామి మడుగుతేరు, సాయంత్రం ధూళోత్సవం నిర్వహించనున్నారు.

20న మెగా కంటి వైద్య శిబిరం

ఉరవకొండ: స్థానిక లత్తవరం రోడ్డులోని చౌడేశ్వరీ తొగటవీరక్షత్రియ కళ్యాణ మంటపంలో ఈనెల 20న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చౌడేశ్వరి వీవర్స్ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం తొగటవీరక్షత్రియ కళ్యాణ మండపంలో చేనేత నాయకులు గట్టు ఎర్రిస్వామి, కళ్యాణ మంటపం ఇన్‌చార్జ్ పెద్దకోట్ల రవి, కమిటీ సభ్యులు గుర్రం హరిదాస్, వెంకటేసులు, మల్లేసి కరపత్రాలను విడుదల చేశారు. చేనేత నాయకులు మాట్లాడుతూ ధర్మవరం రోటరీ క్లబ్ వారి సౌజన్యంతో ఈనెల 20న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం జరుగుతుందన్నారు.

అంధకారంలో రామనగర్

కణేకల్లు: కణేకల్లులోని రామనగర్ కాలనీ మూడ్రోజుల నుంచి అంధకారంలో ఉంది. ఈ కాలనీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలి మూడ్రోజులైంది. అప్పటి నుంచి కరెంటు సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిన విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా స్పందించలేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ఉక్కపోత మరోవైపు దోమలబెడదతో అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

రేపు ఎంవీ రమణ సంస్మరణ సభ

కూడేరు: అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో ఈనెల 18న జరగనున్న సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎంవీ రమణ సంస్మరణ సభకు తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవ రెడ్డి తెలిపారు. శుక్రవారం కూడేరులో ఆ పార్టీ నేతలతో కలిసి సంస్మరణ సభ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మల్లికార్జున, రమణ, మలరాయుడు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వర్షానికి కూలిన ఇల్లు

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరులో భారీ వర్షానికి వన్నల్లి సన్నోడు, వంద్రక్క ఇల్లు కూలిపోయింది. ఈ సమయంలో వన్నల్లి సన్నోడు, వంద్రక్క ఇద్దరి మనుమళ్లతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా, కూలిపోయింది. అయితే ఇంట్లో (మట్టిమిద్దె) వీరు నిద్రిస్తున్న వైపున కాకుండా మరో వైపు కూలిపోవడంతో ప్రమాదం తప్పింది. సుమారు రూ.5 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. వన్నల్లి సన్నోడు కుమారులు వెంటకేశు, చంద్ర కూలిపనుల కోసం వలస వెళ్లారు. వీఆర్వో రామన్న కూలిపోయిన ఇల్లు పరిశీలించాడు.

నిత్యావసర సరుకులు పంపిణీ

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావికి చెందిన సరోజమ్మ, ఆమె మనవడు ఓబులేశులకు చేంజ్ పర్ సొసైటీ సభ్యులు రూ.8వేలు విలువజేసే నిత్యావసర సరుకులు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జబీవుల్లా, మాంతేష్, వన్నూరప్ప, హంపన్న, కేపీ దొడ్డి మంజునాథ, రోజా, అనిత తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కళ్యాణదుర్గం రూరల్: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీఓ రాణి సుస్మిత తెలియజేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పీసీపీఎన్డీటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, భ్రూణ హత్యల నిరోధక చట్టం అమలు కమిటీ చైర్‌పర్సన్, ఆర్డీఓ రానీసుస్మిత తెలియజేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవి, డాక్టర్ రాజేష్, ఏపీఎం నీలామణి, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

19న వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కూడేరు: మండలంలోని ఇప్పేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 19న వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం ప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కేశవరెడ్డి శుక్రవారం తెలిపారు. 17,18 తేదీల్లో వేదపండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన, హోమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

వైభవంగా కలశ ప్రతిష్ఠాపన



కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో సుంకలమ్మ దేవి ఆలయ గోపురంపై శుక్రవారం కలశ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గోపురంపై కలశ ప్రతిష్ఠాపన చేశారు.

మహిళలపై దాడులు సరికాదు

రాయదుర్గంటౌన్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర మహిళా కమిషన్ విఫలమైందని, మహిళల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినులతో కలిసి నిరసన తెలియజేశారు.

జాగ్రత్తలు పాటించాలి

కూడేరు: వర్షా కాలం గొర్రెలు, పశువులు రోగాల బారిన పడకుండా కాపరులు, పశు పోషకులు జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం పశువులను ఆస్పత్రికి తీసుకువచ్చిన పశుపోషకులకు ఆయన వర్షాకాలంలో పశువులకు వచ్చే రోగాలు, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది భాగ్యలక్ష్మీ, రాఘవ, రఘువర్ధన్, భవాని,యశోద తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి



పెనకలపాడులో అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్

కణేకల్లు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెనకలపాడులో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలనీల్లో పర్యటించి, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీదేవి, ఏఎన్ఎం శోభరాణీ, హెల్త్ అసిస్టెంట్ సంపత్, ఆశాలు ఆదిలక్ష్మీ, కళావతి పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ బాలకిషన్‌కు భూ సమస్యలను వివరిస్తున్న నాయకులు

కంబదూరు: దళిత,గిరిజనుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ బాలకిషన్‌ను భూ బాధితులతో కలిసి భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సాకే హరి మాట్లాడుతూ మండలంలోని గొల్లపల్లి, కర్తనపర్తి, చెన్నంపల్లి, కురాకులపల్లి గ్రామాల్లో అనేక ఏళ్లుగా భూ సమస్యలున్నాయన్నారు. దళితులు సాగు చేస్తున్న భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. దళితుల శ్మశాన వాటికలను సైతం కబ్జా చేశారన్నారు. జేఏసీ సంఘం నాయకులు దొణతిమ్మప్ప, నరసింహులు, ప్రతాప్, వెంకటేష్, ప్రకాష్, ఓబుళేసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

రాయదుర్గం: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని రాయదుర్గం రూరల్ సీఐ కే వెంకటరమణ అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఆయన రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ప్రొద్దుటూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా మట్కా, పేకాట, గంజాయి, ఇసుక, మట్టి, దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో ఎంతటివారున్నా ఊపేక్షించేది లేదన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండి, సిబ్బంది సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గం కర్ణాటక సరిహద్దున ఉన్నందున ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. నేరాల అదుపు, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామన్నారు. రౌడీషీటర్ల కదలికలు, గ్రామాల్లో రెచ్చగొట్టి వివాదాలు సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉరవకొండలో భారీ వర్షం



ఉరవకొండలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

ఉరవకొండ: పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురవడంతో పలుకాలనీల్లోకి వర్షపునీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. పట్టణంలోని నాల్గో వార్డులో చిన్నకొండ, సీపీఐనగర్, శివరామిరెడ్డి కాలనీల్లో భారీ వర్షంతో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి డ్రైనేజీలు, వాగులు పొంగిపొర్లాయి. వర్షానికి ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లోని చేనేత మగ్గాల్లో వర్షపు నీరు చెరి ముడిసరుకులు దెబ్బతిన్నాయి.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నగదు, నిత్యావసర సరుకులు అందిస్తున్న ఆంజనేయులు మిత్ర బృందం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన ఆంజనేయులు కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే ఆంజనేయులు అనారోగ్యంతో రెండు నెలల క్రితం మృతిచెందాడు. ఆంజనేయులుకు భార్య శారద, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దీంతో బెళుగుప్ప ఉన్నత పాఠశాలలో 2004–05లో పదోతరగతి చదివిన (ఆంజనేయులు తోటి విద్యార్థులు) విద్యార్థులు చేయి చేయి కలిపి పోగుచేసిన రూ.1,01,000 (లక్షా వెయ్యి రూపాయలు) నగదు , రూ.5వేల విలువజేసే నిత్యావసర సరుకులు స్నేహితుడి ఇంటికి వెళ్లి శుక్రవారం అందించారు. అనంతరం మిత్రుడు ఆంజనేయులు చిత్రపటానికి తోటి మిత్రులందరూ నివాళులర్పించారు.

కొవ్వొత్తులతో ర్యాలీ చేసిన వైద్యులు



కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టిన వైద్యులు, సిబ్బంది

కళ్యాణదుర్గం: కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం...హత్య ఘటనకు పాల్పడిన హంతకుడిని ఉరి తీయాల్సిందేనని వైద్యులు డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి కళ్యాణదుర్గంలో వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ ప్రాణం పోసే పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్‌ను అత్యాచారం చేసి ఆపై హత్య చేయడం అత్యంత పాశవికమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజేష్, ప్రసన్న భారతి, జమీలా, దామోదర్, శివ, శ్వేత, చరణ్, విజయేంద్ర, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకోండి

వజ్రకరూరు: మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు మోనాలిసా, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బెస్త నరేష్ తదితరులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాబార్డు నిధులతో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. హెచ్ఎం స్వర్ణలత, ఆదర్శ పాఠశాల చైర్మన్ హిదాయ్‌తుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.